క్లుప్తంగా

నేడు కలిచేడులో 'గడప గడపకు'

సైదాపురం : మండలంలోని కలిచేడు, మలిచేడు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్న ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

అర్చకులకు ఆర్థిక సాయం



ఆన్‌లైన్ ద్వారా నగదు పంపిస్తున్న దామోదర్‌రెడ్డి

వాకాడు : మండలంలోని బాలిరెడ్డిపాళెంలో ఉన్న పట్టాభిరామాలయంలో బుధవారం సీతారామ ధార్మిక సేవాసంస్థ వారు పేద అర్చకులకు ఆర్థికసాయం అందించారు. ఎన్ఆర్ఐ బలరామిరెడ్డి, వసంతరెడ్డి సౌజన్యంతో అందించిన రూ.55వేలను పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి వివిధ గ్రామాలకు చెందిన అర్చకుల ఖాతాలకు ఆన్‌లైన్‌లో జమ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ శంకరయ్య

పెళ్లకూరు : మండలంలోని పాలచ్చూరు, జంగాలపల్లె ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ శంకరయ్య బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఆదేశించారు. పిల్లలు ఎప్పటికప్పుడు పాఠ్యాంశాలను అధ్యయనం చేయాలని కోరారు. ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే రివిజన్ చేయిస్తూ, స్లిప్ టెస్ట్‌లు నిర్వహిస్తూ అన్ని సబ్జెక్టుల్లో విద్యార్థులను మేటిగా తీర్చిదిద్దాలన్నారు. మెనూ ప్రకారం పిల్లలకు మధ్యాహ్న భోజనం వడ్డించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పశు వైద్య శిబిరం



పశువులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

దక్కిలి (బాలాయపల్లి) : మండలంలోని మన్నూరు గ్రామంలో బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం వారు ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ పశువుల పునరుత్పత్తి సామర్థ్యం పెంపొందేలా రైతులు దాణా అందించాలని సూచించారు. జీవాల్లో రోగనిరోధక శక్తిని పెంచేలా చర్యలు చేపట్టాలని కోరారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు అవసరమైన గడ్డి రకాలను అందించేందుకు సిద్ధం ఉన్నట్లు వెల్లడించారు. అనంతరం జీవాలకు టీకాలు వేశారు. పిడుదల నివారణకు ఆయుర్వేద మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ నాగార్జునరెడ్డి, పశు వైద్యాధికారి సుధీర్, సహాయకుడు వంశీ పాల్గొన్నారు.

అచీవ్‌మెంట్ సర్వే పరిశీలన



విద్యార్థులకు సూచనలిస్తున్న సుధీర్‌బాబు

కలువాయి: కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6, 9వ తరగతులకు బుధవారం నిర్వహిస్తున్న స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే నమూనా పరీక్షను శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి జి.సుధీర్‌బాబు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బాలికలు విద్యతో పాటు అన్ని రంగాలలో ముందంజలో ఉండాలని సూచించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్ ప్లస్ జూనియర్ బాలికల కళాశాలలో మాట్లాడుతూ విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్, విద్యలో ఎలా రాణించాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 జి.శేషగిరిరావు, ఉపాధ్యాయులు ప్రసాద్‌రావు, రాంబాబు, కృష్ణయ్య, శ్రీనివాసులు, ఓబులేశు, జీవీ రమణయ్య పాల్గొన్నారు.

పాఠశాలలకు వంట పాత్రలు



వంట పాత్రలు అందిస్తున్న ఎంపీపీ రఘురెడ్డి

తడ: జగనన్న గోరుముద్ద పథకానికి అవసరమైన వంట పాత్రలను బుధవారం ఆయా పాఠశాలలకు అందజేశారు. బుధవారం ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ కె.రఘురెడ్డి చేతుల మీదుగా వంట పాత్రలను ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పింఛన్.. పంచెన్

పడిగాపులు లేవు.. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు లేవు.. వేకువనే వలంటీర్లు వచ్చేస్తున్నారు. లబ్ధిదారులు ఇంటి తలుపు తడుతున్నారు. వేలిముద్ర పడకపోయినా ఐరిష్ విధానంతో సామాజిక పింఛన్ సొమ్మును చేతిలో పెడుతున్నారు. బోసినవ్వుల అవ్వాతాతలను ఆనందపరుస్తున్నారు. దివ్యాంగులు.. వితంతువు.. ఒంటరి మహిళలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఎప్పటిలాగే బుధవారం సైతం పింఛన్ల పంపిణీని ముమ్మరంగా చేపట్టారు. నాయుడుపేట పట్టణంలో సాయంత్రానికే 90శాతానికి పైగా లబ్ధిదారులకు నగదు అందించినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

– నాయుడుపేట టౌన్/ సైదాపురం/ చిల్లకూరు



నాయుడుపేటలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ మైలారి మణెమ్మ





సైదాపురం మండలంలో వృద్ధురాలు, దివ్యాంగ బాలికకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న చేస్తున్న వలంటీర్లు



చిల్లకూరు: మంచానికి పరిమితమైన సాత్విక వేలి ముద్ర తీసుకుంటున్న వలంటీర్ సంధ్యారాణి



నాయుడుపేటలో వృద్ధులకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ మహేంద్ర

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా 'సురక్ష'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్ : ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. బుధవారం పట్టణంలోని సీఎస్ఎం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. స్టాల్స్‌ను పరిశీలించి, రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సురక్ష శిబిరాల్లో పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఖరీదైన పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ప్రజాసేవే పరమావధిగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత అన్నం మురళి పాల్గొన్నారు.

దక్కిలి (బాలాయపల్లి): మండలంలోని నిడిగల్లు సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. పలువురు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రబాబు, వైద్యులు డీసీఎస్ మృదుల వాణి, సుజాత, సుప్రజ, శివ ప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రాజు, ప్రమీల, సర్పంచ్‌లు గాయత్రి, రత్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు రత్నమ్మ, సచివాలయ మండల కన్వీనర్లు రాఘవరెడ్డి, గౌసున్నీసాబేగం, స్థాని నేతలు దశరథ రామిరెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ



వెంకటగిరి : వైఎస్సార్‌సీపీ నేతలను పరామర్శిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం పలువురు నేతలను పరామర్శించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉమా మహేశ్వరి తండ్రి, పార్టీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు బావ పులుగొల్లు గంగాప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన నివాసానికి వెళ్లి సంతాపం తెలిపారు. గంగాప్రసాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద పాల్గొన్నారు.

ఓజిలి : మండలంలోని అత్తివరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ జరుగుమల్లి బాబురెడ్డిని నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పరామర్శించారు. బాబురెడ్డి అన్న జరుగుమల్లి దశరథరామిరెడ్డి బుధవారం అనారోగ్యంతో మృతి చెందడంతో నాయుడుపేటలోని ఆయన నివాసానికి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ అద్దం అరుణారెడ్డి, కన్వీనర్ పాదర్తి హరనాథ్‌రెడ్డి, సర్పంచ్ కొండూరు ప్రభాకర్‌రాజు, నాయకులు డి.మధుసూదన్‌రెడ్డి, వి.హరనాథ్‌రెడ్డి, జి.వెంకట్‌రెడ్డి, పి.మధుసూదన్‌రెడ్డి, తిరుపాలయ్య, నారాయణ పాల్గొన్నారు.



ఓజిలి : బాబురెడ్డిని పరామర్శిస్తున్న రాంకుమార్‌రెడ్డి

జనం కోసమే జగనన్న సేవా సమితి



మాట్లాడుతున్న ఊటుకూరు మహేంద్రరెడ్డి

గూడూరురూరల్ : జనం కోసమే జగనన్న సేవా సమితి ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ నేత ఊటుకూరు మహేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని పీఆర్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తితోనే నిరుపేదలకు విద్య, వైద్యం, ఆహారం అందించేందుకు సేవా సమితిని ప్రారంభించామని వెల్లడించారు. గూడూరు అర్బన్, రూరల్ మండలాల్లోని మొత్తం 23 పంచాయతీలకు గాను 19 మంది కమిటీ సభ్యులు, 250 మంది వలంటీర్లతో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ప్రతి పేద విద్యార్థికీ చేయూతనందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్‌రెడ్డి, ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరెడ్డి, నెర్నూరు సర్పంచ్ చిన్నయ్య, పులి వెంకటేశ్వర్లు, తిరుపాలయ్య పాల్గొన్నారు.

నేల బావుల్లో నీటి శాతంపై నివేదిక



మాట్లాడుతున్న ఏపీఓ గిరిబాబు

చిల్లకూరు : పల్లెల్లోని నేల బావుల్లో నీటి శాతం గుర్తించి నివేదిక తయారు చేయాలని ఉపాధి ఏపీఓ గిరిబాబు ఆదేశించారు. బుధవారం మండలంలోని ఉపాధి కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ వర్షాభావం కారణంగా భూగర్భజలాల పరిరక్షణపై ప్రభుత్వ దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగా గురువారం సాయంత్రం లోపు నేల బావులను పరిశీలించి నీటి లభ్యత వివరాలను నివేదికలో పొందుపరచాలని స్పష్టం చేశారు. అలాగే ఫిష్ పాండ్‌ల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం నీటి శాతం కనుగొనడంపై శిక్షణ ఇచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వితరణ



వస్తువులు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గూడూరురూరల్ : పట్టణంలోని పూలతోట అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన సామగ్రిని బుధవారం లయన్స్ క్లబ్ సభ్యులు వితరణగా అందించారు. క్లబ్ జిల్లా చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ మెహబూబీ, లయన్స్ క్లబ్ రామ్మోహన్‌రావు, ఎంవీ రమణయ్య పాల్గొన్నారు.

రక్తదాతలకు అభినందన



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

గూడూరురూరల్ : పట్టణంలోని ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన శిబిరంలో రక్తదానం చేసిన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు అభినందించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, శాలీస్ నెల్లూరు చాప్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చన్నారు. సామాజిక సేవలో తమ కళాశాలను భాగస్వామ్యం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ఇతరులకు సాయం చేయడంతోపాటు ఆరోగ్యానికి కూడా మంచిదని వివరించారు. కార్యక్రమంలో శాలీస్ నెల్లూరు చాప్టర్ చైర్మన్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్. ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ విజయ మహేష్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం



మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రముని

నాయుడుపేట : ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీఓ చంద్రముని ఆదేశించారు. బుధవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. మరణించిన ఓటర్లను గుర్తించి వెంటనే జాబితా నుంచి తొలగించాలని స్పష్టం చేశారు. ప్రతి బూత్‌లో ఓటు నమోదు, తొలగింపులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొత్త ఓట్లను డిసెంబర్ 9వ తేదీ వరకు నమోదు చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. నవంబర్ 4, డిసెంబర్ రెండు రోజులు పాటు స్పెషల్ క్యాంప్ కింద బీఎల్ఓలు ఆయా బూత్‌లలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ మాగర్ల రాజేంద్ర, కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తడ: ఓటరు నమోదు, జాబితా తయారీ పక్కాగా జరగాలని ఆర్డీఓ చంద్రముని స్పష్టం చేశారు. తడ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కటారి జయజయరావు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మపై అవగాహన



ఓజిలి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అరుణారెడ్డి

పెళ్లకూరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 18 ఏళ్లకు పైగా పూర్వీకుల నుంచి వచ్చిన వృత్తిని చేస్తున్న హస్త కళాకారులు పీఎం విశ్వకర్మకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి గుర్తింపుకార్డు అందించనున్నట్లు వెల్లడించారు. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేచనున్నట్లు తెలిపారు.

ఓజిలి: పీఎం విశ్వకర్మ పథకాన్ని చేతివృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గద్దం అరుణారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సాంప్రదాయ నైపుణ్యాలు, హస్తకళలను ప్రోత్సహించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని వెల్లడించారు. మండలంలో ప్రతి పంచాయతీ నుంచి 20 మందిని ఎంపిక చేసి రూ.3లక్షల చొప్పున రుణాలు మంజూరు చేస్తున్నారని వివరించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, ఈఓపీఆర్డీ మోహన్ పాల్గొన్నారు.

విజలెన్స్ విచారణకు వినతి

దక్కిలి : మండలంలోని సంఘమిత్ర కార్యాలయం, ఉపాధి పనుల్లో జరుగుతున్న అక్రమాలపై విజలెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు గద్దల మునెయ్య కోరారు. బుధవారం ఈ మేరకు ఎంపీడీఓకు వినతి పత్రం అందించారు.కార్యక్రమంలో ముత్యం చెంచుకృష్ణయ్య, పి.ప్రసాద్, దందువోలు కృష్ణయ్య పాల్గొన్నారు.

కండలేరులో 11.381 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 11.381 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5 , మొదటి బ్రాంచ్ కెనాల్ కు 5, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు

అజరామరం.. అమరజీవి త్యాగం



వెంకటగిరిరూరల్ : పొట్టి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న కమాండెంట్ ప్రకాష్



గూడూరురూరల్ : అమరజీవి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఆర్డీఓ, తదితరులు



నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో..

- వేడుకగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం
- పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు

గూడూరురూరల్ : పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టిశ్రీరాములు, తెలుగుతల్లి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఏఓ మునిలక్ష్మి, తహసీల్దార్ బి.లీలారాణి పాల్గొన్నారు.

వెంకటగిరిరూరల్ : మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. కమాండెంట్ పి ప్రకాష్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ అరుణ్‌బోస్, డీఎస్పీ ఎన్టీవీ రామ్‌కుమార్, అసిస్టెంట్ కమాండెంట్ ఆనంద్‌ఖన్నా, మనోహర్ పాల్గొన్నారు.

నాయుడుపేటటౌన్ : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక కొనియాడారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దిన్, కౌన్సిలర్లు దార రవి, పాపారెడ్డి చంద్రారెడ్డి, సి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పాతబస్టాండ్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నేతలు, పలు సంఘాలవారు నివాళులర్పించారు.



తడ: నివాళులర్పిస్తున్న ఎంపీపీ రఘురెడ్డి తదితరులు

చిల్లకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు.

పెళ్లకూరు : మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. అమరజీవికి నివాళులర్పించారు. ఎంపీపీ అరుణారెడ్డి, ఎంపీడీఓ రజనీకాంత్, సూపరింటెండెంట్ ప్రసన్న, ఈఓపీఆర్డీ మోహన్, సిబ్బంది రవి పాల్గొన్నారు.



ఓజిలి: నివాళులర్పిస్తున్న ఎంపీపీ అరుణారెడ్డి



నాయుడుపేటలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న నేతలు



పెళ్లకూరు : మండల పరిషత్ కార్యాలయంలో..

తడ: ఎంపీడీఓ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి ఎంపీపీ కె.రఘురెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.